'ఇక్కడ దీపం ఆరితే లోకం అంతా చీకటే'

"ఇంక గంటలో రైలు. చప్పున చెప్పు."

"ఏం చెప్పను?"

"ఇష్టం వుందా లేదా?"

మాళవి మాట్లాడదు. స్వచ్ఛంగా మెరిసే కళ్ళు— క్రమమైన తెల్లటి పళ్ళవరస, ఆ నల్లటి మొహానికి అమాయకత్వాన్ని ఆపాదించాయి. కుట్ర, కపటం, దాపరికం ఎరగని పవిత్రమైన రూపం.

"మాట్లాడవేం."

"నీకుందా?" నవ్వుతోంది మాళవి— బాదంచెట్టు చివరికొమ్మ కేసి చూస్తూ. ఏదో పొడుగాటి పురుగు ఆకుని పొడుస్తోంది. బాదంఆకు వూడి ఆమెమీద పడింది. దాన్ని తొలిగించాడు రంగయ్య.

"నువ్వంటే....మరి....ఎలా చెప్పాలో తెలియదు" సిగ్గుపడు తున్నాడు రంగయ్య.

"నీకంత సిగ్గయితే— నాకెట్లాగుంటుంది?"

"ఊ" అనరాదూ? రైలు టైమవుతోంది; నే వెళ్ళాలి. "ఆ రైలు తప్పిందంటే కొంప మునుగుతుంది."

"ఎట్లా మునుగుతుందేం?"

"అదంతా చెప్పేటందుకు టైములేదు. ఇప్పుడు నువ్వు 'ఊ' అంటివా చాలా హుషారుగా పోతా పై దేశానికి. నీ ప్రేముంటే నాకింకేమీ అక్కర్లేదు. బాగా కష్టపడి పనిచేసి మంచిపేరు సంపాదించుకొస్తా. మలయాలో మలేరియా వ్యాధికి జనం పురుగుల్లా చస్తావుండారట. వాళ్ళందరికీ మందులిచ్చి, నయం చేసానంటే— మంచి పేరొస్తుంది. ఉద్యోగం వస్తుంది. నీకు మంచి ఇల్లు, మంచి బట్టలు, వొకటేమిటి."

"అంతా దొంగమాటలు."

"చేతులో చెయ్యి వెయ్యనా ?"

"తాకితివా" కళ్ళు పెద్దవిచేసింది.

"పోనీ ప్రమాణం చేసేదా ?" ఆమె చేతిని తీసుకున్నాడు.

"ఇదేమిటి చెయ్యి చల్లగావుంది ?" అన్నాడు రంగయ్య, ఆమె చేతినాడిని పరీక్షచేస్తూ.

"మలేరియాలే" అంది మాళవి; ఇద్దరూ నవ్వుతున్నారు. పైన కాకులు బాదంకాయలను కలవర పెడుతున్నాయి. ఒక కాయ వారిద్దరిమధ్యా పడింది.

"ఇదుగో కొరికిచ్చేదా ?" అన్నాడు.

"ఛీ ఛీ కాకెంగిలి."

"మరి నే పోతా— ఇంక టైములేదు ఇదుగో అక్రెను వ్రాసివచ్చిన కవరు. ఉత్తరం వ్రాయేం ?"

"ఏం వ్రాయను ?"

"ఒంట్లో ఎట్లావుంది. మీ అత్త ఎట్లా వున్నది— మీ తమ్ము డెట్లా వున్నదీ."

"అప్పుడే వెళ్ళటూక." అని అతని భుజంమీద చెయ్యివేసి నిలిపింది. అతను నిలిచిపొయ్యాడు.

"అమ్మయ్య— ఇప్పుడు నీ చేయి వేడిగా వుంది. దొంగపిల్ల— ఇష్టంవుండి కూడా లేనట్లు నాటకం."

"నాటకమా.... అట్లాగైతే పో.... నీకు నేనంటే ఇష్టంలేదు. ఇష్టంవుంటే అప్పుడే వెళ్ళిపోతానంటావా ఏమిటి ?"

"ఖలేదానివే— ఇది అర్జంటుపని— అక్కడ జనం ఈగల్లా చస్తా వుండారు."

"వాళ్ళెవళ్ళో ఎక్కడో చస్తే మనకేం.... నీకు వాళ్ళే ముఖ్యం" కోపంగా మొహం కిందికి దించింది మాళవి. రంగయ్య చేతితో పైకెత్తి, ఆమె కళ్ళల్లోకి తీక్షణంగా చూశాడు.

"ఇటు చూడు.... కోపమా ? వాళ్ళంతా చచ్చిపొయ్యారనుకో— అప్పుడు వాళ్ళ పెళ్ళాలు, పిల్లలు ఏడవరూ ?"

"నీకు నేను ముఖ్యమా, వాళ్ళా."

"దానికీ దీనికీ సంబంధం ఏమిటి.... వాళ్ళు బాగుంటే కదా. మనం సుఖంగా వుండేది !"

"అసలు మలయా నువ్వు పోడం దేనికి ? నువ్వు పోనేకూడదు. నా దగ్గరే వుండాలి" నవ్వుతుంది మాళవి. తేటగా, మొగ్గ విప్పారుకున్నట్లు, శిఖరం వెనకనించి చందమామ బైటపడినట్లు, కెరటం నురుగు నల్లరాతిపై చిత్రం గీచినట్లు, ఆమెకేసి చూడగానే మనస్సులో ఆనందంతో కూడుకున్న ఉద్రేకం ఆకృతి తెచ్చుకున్నట్లు నైతికబలం నుండి జనించే అనుభూతితో రంగయ్య ముఖం వెలిగింది.

"నేను దూరంగా వెళ్ళినకొద్దీ, నీకు దగ్గరగా వొచ్చినట్లనిపిస్తుంది. ఇదుగో చేతులో చెయ్యి." అని ఆమె చేతిని గట్టిగా అదుముతున్నాడు.

"నా మలేరియా నీకు పట్టుకుంటుంది" చేతిని విదిలించి వేసింది.

"నా కదిష్టమే."

"నా జబ్బు కుదర్చకుండా— నువ్వు వెళ్ళిపోతానంటే...."

"నీ జబ్బుకి మందు నే మలయా వెళ్ళడమే.... ప్రేమ జబ్బు."

"పో...." అని జడ ముందుకు తీసుకుని కోపంగా అతనికేసి చూసింది. కాని రంగయ్య ఆమె కళ్ళలో చూసింది దయ-కోపం కాదు.

"అదే చేస్తున్నా...." రంగయ్య వెళ్ళాడు.

"వెడుతున్నావా ? మరో నిమిషం వుండకూడదా ?"

దూరంగా వెళ్ళినవాడు వెనక్కి తిరిగి అంటున్నాడు.

"ఇంట్లోకెళ్ళి కప్పుకొని పడుకో" వెళ్ళాడు.

గబగబ స్టేషనికి వెళ్ళాడు. రైలు వెళ్ళి ఐదు నిమిషాలైంది. దిగాలు పడి కూర్చుండిపొయ్యాడు. మళ్లా రాత్రి పదింటికిగాని రైలులేదు. ప్లాట్‌ఫారంమీద మందులుగల కర్రపెట్టె అల్లాగే వుంది. దాన్ని తూచడం, లేబిల్సు అంటించడం అన్నీ జరిగాయి; ప్రయాణానికి సిద్ధంగావుంది. ఆ పెట్టెనిండా, ఇన్‌జక్షన్ సామాన్లు, బెరిబెరి, మలేరియా, కలరా "పచ్చ జ్వరం" మొదలైన వ్యాధుల చికిత్స కవసరమైన పరికరాలు, మందులూ వున్నాయి. ఇండియానుంచి ఎనమండుగురు డాక్టర్లు, అరుగురు

కాంపౌండర్లు, యీ మందులతో మలయావెళ్ళి అక్కడ యుద్ధరంగంలో వ్యాధిగ్రస్థులకు చికిత్సలు జరపాలి. డాక్టర్లు క్రితంరోజునే మద్రాసు వెళ్ళారు. అక్కడనుండి విమానంలో క్వాలాలంపూర్ వెళ్ళాలి. రంగయ్యని మందులపెట్టి తీసుకుని రమ్మన్నాడు డాక్టర్ జాకబ్. రైలు తప్పింది. ఏమిటి చెయ్యడం ?

రంగయ్యకి మతిపోయింది. ఆలోచన తట్టడంలేదు. కనబడినవారి నల్లా సలహా అడుగుతున్నాడు. బెజవాడ వెళ్లే ఒక లారీలోబడి, మధ్యలో అది చెడిపోతే నానా యిబ్బందిపడి చివరకు బెజవాడ వొచ్చేటప్పటికి మెయిలువెళ్ళి అరగంటయింది. మళ్ళా ఉదయం ఎక్స్‌ప్రెస్ తప్ప బండి లేదు. భోజనంలేదు. ఆ మందులపెట్టిని కౌగలించుకొని అల్లాగే ప్లాట్‌ఫారం మీద రాత్రంతా గడిపాడు. దాన్ని కౌగలించుకుంటే తన సర్వరోగాలు పోయినట్లు— ఏమిటో అదోలా జరిగిపోయింది రాత్రి.

ఎక్కడో రైలుబాట చెడి, ఎక్స్‌ప్రెస్ రెండుగంటలు లేటైంది. మద్రాసు చేరుకునేటప్పటికి సాయంత్రం ఆరయింది. విమానం నాలుగింటికే వెళ్ళిపోయింది. అందులో డాక్టర్లు వెళ్ళిపొయ్యారు. డాక్టర్ జాకబ్ విమానాశ్రయంలో రంగయ్యకి వొక చీటి వ్రాసివుంచాడు— మర్నాడు విమానంలో బైలుదేరి రావల్సిందని— ఫలానాచోట దిగాల్సిందని.

అమ్మయ్య అనుకున్నాడు రంగయ్య. అయినా తన కెందుకంత భయం. ఎనమండుగురు డాక్టర్లు వెళ్ళారు. వాళ్ళు చాలా మందులపెట్టెలు తీసుకువెడతారు. పైగా క్వాలాలంపూర్‌లో గొప్ప మందుల కర్మాగారం వుంది. అక్కడ ఎన్నో మందులుంటాయి. తను మర్నాడు వెళ్ళినంత మాత్రాన జరిగే ప్రమాదంలేదు. రాత్రి భోజనంచేసి విశ్చింతగా పడుకున్నాడు మాళవిని స్మరిస్తూ. మాళవి స్వప్నంలో కరిగిపోయింది— నిద్రలో. అతని కళ్ళంట కన్నీటిబొట్లు గడ్డకట్టినట్లు కొనలని అంటి వున్నాయి ఉదయాన లేచి చూసుకునేప్పటికి.

మర్నాడు, విమానం వెళ్ళదట. ఏం చెయ్యడం ? మలయాలో యుద్ధపరిస్థితి ఏర్పడటంవల్ల, ఎప్పుడు వెడుతుందో, అసలు వెడుతుందో వెళ్ళదో ఎవరికీ తెలియదు; అక్కడివారి సలహా

అడిగాడు. తన అవసరం గురించి ఉద్రేకంతో ఏడుస్తూ చెప్పాడు. విమానాశ్రయంలో చాలా సానుభూతి కనబరిచారు. ఒక్కటే మార్గం— ఓడలో సింగపూర్ వెళ్ళమన్నారు. ఓడలో సింగపూర్ బైలుదేరాడు రంగయ్య. ఆ ఓడలో వెయ్యిమందికిపైగా భారతీయ యుద్ధ సైనికులున్నారు. వారితో కబుర్లు చెబుతూ రంగయ్య ధైర్యంగా వున్నాడు.

అవి 1941-1942 యుద్ధం రోజులు. ఇండోచైనా, సయామ్‌లను స్వాధీనం చేసుకున్నాయి జపానీయ సేనలు. 1941 డిసెంబరు 8వ తేదీని బ్రిటిషు మలయాపై దాడి ప్రారంభించినై. సింగపూర్‌ని స్వాధీనం చేసుకోడం వారి ప్రధాన ఆశయం. వారి సేనలు పురోగమిస్తున్నాయి. ఆస్ట్రేలియా, భారతీయ, ఆంగ్లేయ, మలయా సేనలు విరోధిస్తున్నాయి. కాని అదంతా విఫలమయింది. జపానీయులు సింగపూర్‌ని ఆక్రమించు కున్నారు. నీటి సదుపాయాలు నిలిపివేశారు. లొంగిపోవల్సిందిగా విమానం నుంచి చీటీలు పడవేశారు. ఫిబ్రవరి 15వ తేదీని వేలాది బ్రిటిష్, భారతీయ, ఆస్ట్రేలియన్ సైనికులు శత్రువులకు లొంగిపోయ్యారు. యుద్ధఖైదీలుగా చిక్కినవారిలో రంగయ్య వొకడు.

జోహోర్ ప్రాంతంలో భారతీయ డాక్టర్లు గాయపడిన వారికి, వ్యాధిగ్రస్థులకు చికిత్సచేసి ఎంతో సాయపడ్డారు. డాక్టర్ జాకబ్ దిగిన చోట మందులు దొరకలేదు. తను తెచ్చిన మందులయిపొయ్యాయి. తన మందులపెట్టె, కాంపౌండర్ తీసుకురాలేదు. మరో రెండురోజులవరకూ, తోటి డాక్టర్ల సహాయం, మందులు అతనికి లభించలేదు. లభించివుంటే, మరో వందమందికి చికిత్స జరిగివుండును. వారు మరణించకపోదురు. డాక్టర్లందరూ తమ పని ముగించుకుని సురక్షితంగా భారతదేశం తిరిగి వొచ్చారు.

* * * *

యుద్ధం సమాప్తమై, 1945 సెప్టెంబర్ 3వ తేదీని జపానీయులు లొంగిపోయిన పిదప, రంగయ్య విడుదలై, భారతదేశం తిరిగి వొచ్చాడు.

మలయా పునర్నిర్మాణానికి తోడ్పడిన ప్రపంచ సైనిక బృందానికి తిరిగి రాగానే, మద్రాసు హార్బరులో ఘనస్వాగతమిచ్చారు. మద్రాసులో రెండు రోజులున్న తర్వాత రంగయ్య స్వగ్రామం చేరుకున్నాడు. రైలు

దిగగానే గ్రామపెద్దలు అతనికి సుస్వాగతం చెప్పి, పూలమాలలువేసి, డాక్టర్ జాకబ్‌గారి జీపులో కూర్చోపెట్టి ఫొటోలుతీసి, ఇంటికి తీసుకు వెళ్ళారు.

రంగయ్యకి ఇదంతా స్వప్నంలాగుంది. మద్రాసులో సోకిన మలేరియావ్యాధి తమ గ్రామంలో దిగగానే తీవ్రరూపం దాల్చింది. గజగజ వొణికిపోతున్నాడు. పళ్ళు బిగించి రగ్గు కప్పుకుని జీపులో వాలిపొయ్యాడు. కళ్ళు మూతలుపడుతున్నాయి. ఎవరెవరైందీ అతనికి తెలీడంలేదు. ఎవరో జనం మధ్యలోంచి తోసుకొచ్చి, అతని నుదిటిమీద చెయ్యివేశారు— ఎవరో నర్సు— ఆమె చెయ్యి చల్లగా తగిలింది— అతని కాలిపొయ్యే నుదుటిమీద, అతని తలని ఆమె నిమురుతోంది— దగ్గరగా ఆమె వక్షం వైపు లాగుతోంది— స్వచ్ఛమైన కళ్ళు— మహారణ్యంలో చెట్లు తగల బడి ఆకాశాన్ని వెలిగించినట్లు— తెల్లగా మెరిసే పళ్ళవరస—ఎవరో— ఏవో జ్ఞాపకాలు. అస్పష్టంగా— ఘనీభవించే వ్యవధిలేక కరిగిపోతున్నట్లు, జపానీయుల పెద్ద పళ్ళవెనక పిడుగులాంటి నవ్వు: తమిళుల గళ్ళలుంగీల పైభాగంలో నల్లని వెన్నుపై చెమటబిందువులు, మలయాస్త్రీల మెత్తని కంఠాలు, ఆడుకునే పిల్లల గుండెలకింద చర్మం వెనుక ఎముకలు, ఇంగ్లీషు నాయకుడి టోపి, తుపాకి మొదళ్ళు, సిగరెట్టు పీకలు, త్రాగుడు సీసాలు, కార్కులు, సిరంజీలు, సూదులు, మందుగుళ్ళు పాకేజీలు, రబ్బరుచెట్ల బెరడులు, లిప్‌స్టిక్కు సీసామూతలు, భారతదేశ పతాకంపైన గీతలు— పైకి, పైన— ఇంకా పైన నిర్మలమైన ఆకాశంలో పల్చని మేఘం— దాని వెనుక నక్షత్రం— టెలిస్కోప్‌లో చూస్తే రెండు నక్షత్రాలుగా విడిపోతై— వొకదాని వెనక వొకటి తిరుగుతూ తనూ— మాళవికి మల్లే.

“నేనే, గుర్తు పట్టలేదా.”

కళ్ళు బలవంతంగా పెద్దవిచేసి చూచాడు రంగయ్య. క్షురకర్మ చేసుకోలేదు— మలీమ్ ప్రాంతం అడవిలో ముళ్ళపొదలాగుంది అతని గడ్డం— చేతులో దాచుకున్నాడు. ఆమె చేతిని తొలగించింది.

“ఎవరు?” నీరసంగా పైకి చూశాడు.

"మాళవి" అన్నదామె. అతనికేమీ అర్థంకాలేదు. జీప్ వెడుతోంది. జైజై నాదాలు, మిన్నుముట్టుతున్నాయి.

"ఇంటికొద్దు— హాస్పిటల్‌కి తీసుకువెడదాం" అంటున్నదామె. జీప్ డాక్టర్ జాకబ్ హాస్పిటల్ దగ్గర నిలిచింది.

రంగయ్యని నలుగురు మోసి, వార్డులో వొక మంచంమీద పడుకోబెట్టి, కప్పి, చికిత్సకు వుపక్రమించారు.

రాత్రంతా తీవ్రమైన జ్వరం— పలవరింతలు— అందులో కల— కలలో ప్రేలాపన.

"వొందమందిని చంపేశాను.... నేను హంతకుణ్ణి.... నన్ను వురితియ్యండి...." అంటున్నాడు రంగయ్య.

* * * *

ప్రక్కన డాక్టర్ జాకబ్. తలదగ్గర నర్సు మాళవి. జాకబ్ ఇండియా తిరిగిరాగానే, రంగయ్య ఉదంతం విని, ఆమెపట్ల సానుభూతితో, చదువు లేకపోయినా మాళవికి నర్సుగా తర్ఫీదిచ్చి, నెలకేదో ముట్టచెప్పి తన హాస్పిటల్‌లో వుంచి వోదారుస్తున్నాడు. రంగయ్యని గురించి భోగట్టా తెలుసుకొని ఆమెకు చెబుతూ వుండేవాడు. అతను సురక్షితంగా కొన్ని వేల భారతీయ సైనికులతో కలసి శత్రువులచే బంధితుడైనట్లు, తిరిగి విడుదలయ్యే సూచనలున్నట్లు చెప్పేవాడు. జపానీయులు లొంగిపోగానే, వారందరూ విడుదలై క్షేమంగా ఇంటికి వొస్తున్న సంగతి కూడా అతనే చెప్పాడు.

"ఏమిటి ప్రేలాపన— నాకు భయంగా వుంది" అన్నది మాళవి.

"అది పరాకుమాట కాదు. కొంత నిజం చెప్పివెయ్యటం— పశ్చాత్తాపపడటంలాంటిది" అన్నాడు డాక్టర్.

"ఎందుకు ? ఏం తప్పుచేశాడని ?"

"అతను సమయానికి రైలుస్టేషన్‌కి చేరివుంటే, మా అందరితో సహా మలయా అరణ్యంలో దిగి, అక్కడి వారికి సమయానికి చికిత్స జరిగి వుండును. ఆ మందులు లేకపోవడంవల్ల వొక్కరోజులోనూ,

వందకిపైగా జనం మలేరియాకు గురై మరణించారు. అదీ రంగయ్యబాధ" అన్నాడు డాక్టర్ జాకబ్.

"ఇంక నిద్ర పట్టేసింది. ఏం భయంలేదు. రేపటికి నార్మల్‌కి వొచ్చేస్తుంది." అని జాకబ్ మిగతా వార్డులకేసి బైలుదేరాడు. మాళవి కూడా అతని వెంటనే వెడుతోంది. జాకబ్ నవ్వుతున్నాడు.

"పాపం నువ్వు దగ్గర వుండరాదూ?"

"మిగత పేషంట్లని చూడద్దా?"

"నే చూసుకుంటాలే— పైగా మల్లన్న వున్నాడుగా" అన్నాడు డాక్టర్.

"మీతో వొకటి చెప్పనా డాక్టర్‌గారు.... నాకు ధైర్యం చాలడం లేదు...." అన్నది మాళవి.

"చెప్పు. తొందరగా చెప్పు."

"నేను తొందరగా చెప్పకపోవడంవల్లనే మలయాలో జనం సమయానికి మందులందక మరణించారు. వారి చావుకి కారణం రంగయ్య కాదు— నేను. మైమైపోయింది— మనం పెండ్లి చేసుకోడం స్థిరమైనట్లు భావించనా. చెప్పు— అన్నారాయన! వెంటనే చెప్పక, ఆ కబుర్లూ, యీ కబుర్లూ చెప్పి, నా దగ్గరే వుంచేసుకుని జాప్యం చేసింది నేను. ఆ ఐదు నిమిషాల వృధా ప్రసంగంవల్ల ఇంత ప్రమాదం అవుతుందనుకోలేదు— ఈ మలేరియా నాకు సంక్రమించి, నేనే మరణిస్తే— నాకదీ తగిన శిక్ష...." మాళవి కళ్ళమ్మట నీటిబిందువులు జారలేక కనురెప్పలమధ్య ఇరుక్కున్నాయి. జాకబ్ నవ్వుకున్నాడు.

"చిత్రమే. ఇక్కడ యీ మారుమూల గ్రామంలో మనం వొకపని చేస్తే, దాని పర్యవసానం ప్రపంచం అంతటా అల్లుకొని ఎవ్వరూ ఆశించని ఫలితాన్నివ్వడం చిత్రమే." అంటూ వెళ్ళిపొయ్యాడు డాక్టర్ జాకబ్.

మాళవి కళ్ళు తుడుచుకుంది. తిన్నగా రంగయ్య పడుకున్న గదిలోకి వెళ్ళి అతని పక్కనే కుర్చీలో కూర్చుంది. పత్రిక తీసింది. కోటప్ప కొండ తిరణాలు సాగుతున్నాయి. అక్కడ కలరా చెలరేగింది. డాక్టర్లు, నర్సులు, కాంపౌండర్లు వెళ్ళి చికిత్స జరిపే అవసరం వున్నట్లు ప్రభుత్వం ఉత్తరువులు పంపుతోన్న వార్త చూసింది. పరుగెత్తుకుంటూ వెళ్ళింది

మాళవి. డాక్టర్ గదిలో ఉన్నాడు. ఈ వార్త చూపి, తను వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నానంది. మరికొందరు కూడా ఆ సాయంత్రం బైలుదేరుతున్నారనీ, వారితో కలిసి ఆమె వెళ్ళానికి అభ్యంతరం లేదని చెప్పాడు జాకబ్.

మళ్ళా మాళవి రంగయ్య గదిలో కెళ్ళింది. రంగయ్య మెల్లగా కళ్ళు తెరిచాడు.

నీరసంగా నవ్వుతున్నాడు. నుదుటిమీద చెమట తుడిచింది.

"తగ్గిందా ?"

ఆమె చేతుల్ని తీసుకొని తన చెక్కిళ్ళపై అదుముకున్నాడు.

"నన్ను మర్చిపోలేదు. నువ్వెంత మంచిదానివి" అన్నాడు.

"నేను మంచిదాన్ని కాను. నేను చెడ్డదాన్ని. మిమ్మల్ని కబుర్లలో పెట్టి అనుకున్న ప్రయాణం సాగనీక, ఎందరో మరణానికో కారణమయ్యాను. మీరు మంచివారు— నేను తగను...." మాళవి అతని భుజంపై తల అనించి ఏడ్చేస్తోంది.

వెచ్చగా కన్నీరు అతని కంఠాన్ని రాసి జారుతోంది. దారి వెదుకుతూ శిఖరంపై నుండి జారే మంచుకణాల పిల్లనదిలా. అందులో నిలిచి నిలిచి వినబడే పిల్లగానం వినబడుతోంది. దానికి మాటల్లేవు— శ్రుతిలేదు.

తన రెండు చేతులతో ఆమె మొహాన్ని పైకి లేవదీసి కళ్ళల్లోకి చూశాడు. కన్నీరు తొలిగింది. మేఘాలులేని ఆకాశంలా నిర్మలంగా వుంది ఆమె మొహం.

"నువ్వు ఏ తప్పు చెయ్యలేదు. ప్రేమించడం తప్పు కాదు. ఆ ప్రేమకి వాకరికొకరు లొంగిపోవాలనుకున్నాను నేను. ఆలస్యం చేసింది నేను- నువ్వు కాదు. రైలుకి వెళ్ళవల్సింది నేను— నువ్వు కాదు. నీ కోసం—పరోక్షణం నువ్వు నాదానివయ్యావన్న భావంలో ఏ గర్వం అనుభవించడం కోసం జాప్యం చేశాను— స్వార్థపరత్వం నాది— నీదికాదు"

"మీరు మాట్లాడకండి- నీరసంగా వున్నారు." పత్రికలో విషయం చెప్పింది. మరో గంటలో డాక్టర్ల బృందంతో తనూ వెడుతున్న విషయం చెప్పింది.

"టైమవుతోంది. చప్పున చెప్పండి...." అన్నది మాళవి.

"ఏం చెప్పను. ఆలస్యం చెయ్యక వెంటనే వెళ్ళు. తిరిగి వొచ్చిం తర్వాత మాట్లాడుకుందాం."

"నే వెడితే మిమ్మల్ని ఎవరు చూస్తారు ?"

"డాక్టరున్నాడు. పైగా నాకు నయమైపోయిందిగా. నే చేసిన తప్పుకు నేను శిక్ష అనుభవించాను. రెండేళ్ళు ఖైదులో గడిపాను. ఆ తప్పును ప్రేరేపించింది, ప్రేమ.... అది మంచిది. దాని ఫలితంకూడా దక్కింది. నువ్వింక ఎక్కడున్నా నాదానివే.... మరి వెళ్ళు."

రంగయ్య నవ్వుముఖంకేసి చూస్తూనే వెళ్ళింది మాళవి. ఆ నవ్వు వెనక వొక గొప్ప ఆనందంతో కలిసి నీరైన కన్నీటిచుక్క కూడా వుంది. ఆ బరువైన కన్నీరు విడి, ధారగా అతని పెదవులమీదికి జారింది. నిలిచి నిలిచి దూరాన్నుంచి వినబడే మధురగానం. దానికి భాషలేదు. మాట ల్లేవు. ఆద్యంతాలులేవు.

* * * *

అంతే కథ. ఒక యోగిని వెనక ఎవరో ప్రశ్నించారట: "మీరెక్కడో ఏకాంతంగా, ఏ లోయలోనో కూర్చుని దీక్షపూని, తపస్సు చేస్తే, లోకానికి జరిగే ప్రయోజనం ఏమిటి ?" అని. ఆయన అన్నాడుట.

"నిజంగా దీక్షతో తపస్సు చేస్తే నాలోనుంచి వొక శక్తికెరటం బైలుదేరి, మనుషుల హృదయాలు వెదుక్కుంటూ వెళ్ళి లోకం అంతా చుట్టబెడుతుంది" అని.

ప్రపంచంలో మనుషులంతా వొక కుటుంబంవారే నన్నది అంత వరకూ వొక గ్రంథంలో వాక్యంలా, వేదికపై ఉపన్యాసంలో వొక భాగంలా భావించేవాడిని. ఈ వృత్తాంతం విన్న తర్వాత అలా భావించ లేను. ఏకాంతంగా యీ మూల కూర్చుని నే సాగించే ఆలోచనకి అనే మాటకీ, చేసే చేష్టకీ ప్రపంచాన్ని కలవరపరిచే ప్రభావం వుందంటే, నాకు నా వ్యక్తిపట్ల, నా ప్రవర్తన పట్ల ఎంతటి బాధ్యతవుందో భయం వేస్తుంది.

ప్రచురణ : సైనిక సమాచార్ 26-1-1960